# వ్యాస కౌముది



## చాటువులు

- డా. దూర్వాసుల వేంకట సుబ్బారావు



(క్రిందటి సంచిక నుంచీ)

పావులూరి మల్లన కాలం ఇదమిద్ధంగా తెలియకపోయినా, బహుశః భీమకవి సమకాలికుడని పండితాభిప్రాయం. ఈయనకు గణితం, చదరంగం అంటే ఇష్టం. చదరంగం పేరుతో ఒక గట్టి ప్రశ్న ఈ విధంగా అడిగాడు. చదరంగంలో మొత్తం గళ్ళు 64 (8X8). వడ్ల గింజల్ని ఒక్కొక్క గడిలో ఈ విధంగా ఉంచి:

మొద లొకట నిల్పి దానిం
గదియుగ దుది కాక రెట్టిగా గూడిన చొ
విదితముగ బల్కు మాకుం
జుదరంగపు టిండ్లకైన సంకలిత మొగిన్.

అంటే మొదటి గడిలో ఒకటి, రెండవ గడిలో రెండు, మూడవ గడిలో నాలుగు, అలాగే తరువాత గళ్ళలో 8,16,32,64, 128... గళ్ళకు మొత్తం ఎన్ని వస్తాయో చెప్పమంటాడు చమత్కారంగా. దాని జవాబు కూడా తానే పద్యరూపంలో ఇరవై అంకెల సంఖ్య - 18446744073709551615 అని జవాబిచ్చాడు:

శర శశి షట్క చంద్ర శరసాయక రంధ్ర వియన్నగాగ్ని భూ
దరగగనాబ్ధి వేదగిరి తర్క పయోనిధి పద్మ జాస్యకుం
జరతుహినాంశు సంఖ్యకు నిజంబగు తచ్చ తురంగ గేవావి
స్తరమగు రెట్టి రెట్టికగు సంకలితంబు జగత్ప్రసిద్ధికిన్

మనం గుర్తుంచుకోవలసిన సాంకేతాల ప్రకారం శర అంటే 5, శశి అంటే 1, షట్కం అనగా 6. వీటిని కుడి నుంచి ఎడమకు వేసుకుపోతే ఇరవై అంకెల సంఖ్య వస్తుంది. ఇదే విధంగా ఇంకొక వినోద సమస్యని ఆరు ఒకట్లని (1,11,111) అవే ఆరు ఒకట్లచే గుణిస్తే పదకొండు అంకెల సంఖ్య 12345654321 వస్తుందన్నది ఇలా తెలియజేసాడు:

ఆరు నిక్కట్లు నోడ్పుగా నమర బెట్టి
యంత గుణకంబు చేతను నమర బెంచి
సొరిది వర్ణించి జనులకు జోద్యముగను
హిమక రొప మలబ్దంబు నెరయవచ్చు.

భక్తి రసానికి పోత పోసిన పోతన, సరస్వతీ స్వరూపుడే భుక్తికి ఇబ్బంది పడ్డాడే కాని, భక్తితో శ్రీహరిని నమ్ముకొందునని ఈ క్రింది చాటువులో తెలియచెప్పాడు..

కాటుక కంటి నీరు చనుకట్టు పయింబడక నేల ఏడ్చెదో
కైటభ దైత్య మర్దనుని గాదిలి కోడల! యోమదంబ! యో
హాటక గర్భురాణి! నిను నా కటికై కొనిపోయి యల్లక
ర్ణాటకిరాట కీచకుల కమ్మ్రది శుద్ధిగ నమ్ము భారతీ!

తాను రచించిన భాగవతం డబ్బుకి, హోదాకి అమ్ముడు కాదన్నాడు ఇలా:

ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనమ్ములున్
సొమ్ములు కొన్ని పుచ్చుకుని సొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట వ్రేటులంబడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పెనీ
బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్.

మన కవులలో మహాభోగి, శృంగార పురుషుడు శ్రీనాధుడు. మహాజ్ఞానిగా వ్యవహరింపబడే బృహస్పతి గుండెల్లో భయం కలిగించగలనని, "వాణి నా రాణి" అని చెప్పుకున్న కవి సార్వభౌముడు శ్రీనాధుడు రావు సింగమ భూపాలుని కొలువులో పండిత వివాదానికి ముందుగా శారదాంబను ఇలా కొలిచాడు.

దీనారటంకాల దీర్థ మాడించితి / దక్షిణాధీశు ముత్యాల శాల
పలుకు తోడై తాంధ్ర భాషా మహాకావ్య / నైషధ గ్రంథ సందర్భమునకు
పగుల గొట్టించి తుద్భట వివాద ప్రౌఢి / గౌడ డిండిమ భట్టు కంచు ఢక్క
చంద్ర భూషక్రియా శక్తి రాయల యొద్ద / బాదు కొల్పితి సార్వభౌమ బిరుద
మెటుల మెప్పించె దో నన్ను నింక మీద
రావు సింగమ మహీపాలు ధీ విశాలు
నిండు కొలువున నెలకొని యుండు నీవు
సరస సద్గుణ నికురంబ! శారదాంబ!

కర్ణాటక సామ్రాజ్యంలో రాజోచిత సన్మానంలో ఆలశ్యమవటం వల్ల ఇలా ప్రార్థించాడు

కుల్లాయుంచితి, గోక సుట్టితి, మహా కూర్పాసముం దొడ్గితిన్
వెల్లులిం దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా
సల్లాయంబలి త్రావితిన్, రుచులు దోసంబంచు బోనాడితిం
దల్లీ! కన్నడ రాజ్య లక్ష్మి! దయలేదా నేను శ్రీనాధుడన్.

❧ ❧ ❧

(కొనసాగింపు వచ్చేనెలలో)